క్లుప్తంగా

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెడన: పట్టణ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం జరిగే సమావేశంలో 27 అంశాలను పొందుపరిచారని, వీటిపై చర్చించి ఆమోదం తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నేడు కేడీసీసీబీ భవనం ప్రారంభం

నాగాయలంక: మండల కేంద్రం నాగాయలంకలో రూ.1.06 కోట్లతో లక్షలతో నిర్మించిన కృష్ణాజిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు బ్రాంచి నూతన భవనం శనివారం 11.49 గంటలకు ప్రారంభిస్తున్నట్లు బ్రాంచి చీఫ్ మేనేజర్ చింతలపూడి మధుబాబు శుక్రవారం తెలిపారు. బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు భవనాన్ని ప్రారంభించనున్నారు.

శివనాగసాయి మందిరంలో ప్రత్యేక పూజలు



రేమాలవారిపాలెం(నాగాయలంక): విగరం జిల్లా కందివలస షిర్డీ సాయి సేవాశ్రమం పూజ్య గురుదేవులు అమ్ముల సాంబశివరావు దివ్యాశీస్సులతో రేమాలవారి పాలెంలో గత ఏడాది నిర్మించిన శ్రీశివ నాగ సాయి మందిరంలో శుక్రవారం ప్రథమ వార్షిక వేడుక ఘనంగా నిర్వహించారు. నిర్మాణకర్తలు వీవీఆర్ శ్రీనివాసబాబు-నాగలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సాయి సేవకులు పి.శివనాగమల్లీశ్వరి, కె.లక్ష్మి సామూహిక నేతృత్వంలో సాయి సత్యవ్రతం, చందనోత్సవం, అభిషేకాలు, హారతులు జరిగాయి. గ్రామంలో బాబావారి ఊరేగింపు జరిగింది.

రేపు వంగవీటి విగ్రహావిష్కరణ

టి.కొత్తపాలెం(నాగాయలంక): రాధా రంగా మిత్ర మండలి, టి.కొత్తపాలెం యువసేన ఆధ్వర్యంలో కాపు ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగారావు విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఆవిష్కరిస్తున్నట్లు యువసేన ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. నాగాయలంక-ఏటిమొగ మెయిన్ రోడ్డులో టి.కొత్తపాలెం ఇరిగేషన్ బంగళా కూడలిలో విగ్రహం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అవనిగడ్డ శ్రీఆంజనేయస్వామి గుడి నుంచి టి.కొత్తపాలెం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మచిలీపట్నంటౌన్: ఆర్టీసీ మచిలీపట్నం డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు ఈ నెల 24వ తేదీ శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ టి.పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ప్రయాణికులు వారి సమస్యలను, సలహాలు తెలియజేయాలని ఆయన కోరారు. 9959225462 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నేత్రదానం

శ్రీకాకుళం(అవనిగడ్డ): శ్రీకాకుళం వాసి అడపా సుబ్బారావు నేత్రాలను దానం చేశారు. నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్‌తో సుబ్బారావు తనయుడు సాయి నేత్రదానం గురించి తెలియజేయగా విజయవాడకు చెందిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యులు సుబ్బారావు మృతుడి నేత్రాల నుంచి శుక్రవారం రెటీనా సేకరించారు. నేత్రదానం చేసిన సుబ్బారావు భార్య నిర్మల, కుమారులు సురేష్, సాయిని ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శించారు. తమ సంస్థ ద్వారా 199వ నేత్రదానం జరిగినట్టు తలశిల రఘుశేఖర్ తెలిపారు.

ఆటో పల్టీ.. తప్పిన పెనుప్రమాదం!

మోపిదేవి: మోపిదేవిలో అవనిగడ్డ నుంచి చల్లపల్లి వైపు వెళ్తున్న ట్రక్కు ఆటో గంజివానిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం పల్టీ వేసింది. జంక్షన్ కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో ఆటో పల్టీ కొట్టింది. అందులో ప్రయాణికులు ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

412 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: అర్తమూరు-2 సచివాలయ పరిధిలోని మణిమేశ్వరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష(జేఏఎస్) ఉచిత వైద్య శిబిరంలో 412 మందికి పరీక్షలు నిర్వహించినట్లు బంటుమిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వీకే పవన్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు పి.భాస్కర్, టి.హరిప్రసాదు, రమణ, సౌందర్య వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా రక్త, ఈసీజీ తదితర పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మలిశెట్టి వెంకటరమణ, ఎంపీడీఓ వై. రామకృష్ణంరాజు, నాయకులు ఎం. రాజబాబు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరమం.. పవిత్రం..

- నేడు హంసలదీవి సాగరతీరంలో మాఘపౌర్ణమి(సింధు) స్నానాలు
- ముమ్మర ఏర్పాట్లు



సాగరతీరంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న డీఎల్‌పీఓ, పంచాయతీ అధికారులు



సాగరసంగమం వద్ద కళకళలాడుతున్న కృష్ణమ్మ విగ్రహం

కోడూరు: మహాబలేశ్వరంలో జన్మించిన కృష్ణమ్మ వేలాది కిలోమీటర్లు ప్రయాణించి సాగరుడిలో కలిసే పవిత్ర హంసలదీవి క్షేత్రం మాఘపౌర్ణమి (సింధు) స్నానాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ప్రకృతి రమణీయతను పంచే కృష్ణా సాగర సంగమ పవిత్రత, ఆధ్యాత్మిక, ఆనందోత్సవాల నడుమ భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం తెల్లవారుజామున 5గంటల నుంచే భక్తులు సింధు స్నానాలు చేయడానికి అవకాశం కల్పించారు.

అధికారుల సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మాఘపౌర్ణమిని పురస్కరించుకొని వచ్చే భక్తుల కోసం జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. సాగరసంగమం, సముద్రం వద్ద పటిష్టమైన బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి, పర్యాటకుల భద్రతకు పది మరబోట్లు, 60మంది గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. కోడూరు, మందపాకల పీహెచ్‌సీల ఆధ్వర్యాన ఇప్పటికే నాలుగు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, 108 వాహనాన్ని కూడా సిద్ధంగా ఉంచారు. తీరం ఒడ్డున ఆరు తాత్కాలిక మరుగుదొడ్లను కూడా నిర్మించారు. పాలకాయతిప్ప నుంచి సాగరతీరం వరకు రహదారికి మరమ్మతులు చేసి, జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 200మంది పోలీసులు, 90మంది మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తు చేపడుతున్నారు. యాత్రికుల కోసం అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి హంసలదీవి స్పెషల్ పేరుతో ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా నడుతున్నారు.

హంసలదీవి సాగరతీరంలో సింధుస్నానాలు ఆచరించేందుకు వచ్చే పర్యాటకులతో పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. శుక్రవారం హంసలదీవి వేణుగోపాలుడి ఆలయం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించి సిబ్బందికి డ్యూటీలు కేటాయించారు. తీరానికి వచ్చే భక్తులను కోడూరు-దింటిమెరక మీదుగా పంపి, తిరుగు ప్రయాణం హంసలదీవి, ఉల్లిపాలెం మీదగా ఉండేలా చూడాలని డీఎస్పీ ఆదేశించారు. సాగరసంగమం వద్ద పరిస్థితులు అనుకూలించకపోవడంతో అక్కడ సముద్ర స్నానాలను నిషేధించామని డీఎస్పీ చెప్పారు.

లక్ష మందికి పైగా వచ్చే అవకాశం..

సింధుస్నానాలకు లక్ష మందికిపైగా యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బందరు డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, సీఐ శ్రీనాథ్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఎస్‌ఐ శిరీష, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం శుక్రవారం సాగరతీరంలో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కృష్ణమ్మ పాదాలు, విగ్రహానికి నూతన హంగులు

సాగరసంగమం వద్ద ఉన్న కృష్ణమ్మ పాదాలు, విగ్రహానికి దాతల సహకారంతో నూతన హంగులు సమకూర్చారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రతిష్ఠించిన అమ్మవారి పాదాల ప్లాట్‌ఫాం అలల ధాటికి కుంగిపోవడంతో దాతలు ముందుకొచ్చి రూ.20వేలతో అభివృద్ధి పనులు చేశారు. పాదాలు, విగ్రహానికి నూతన రంగులు వేశారు. తీరంలో ఉన్న మూడు బాల ఆలయాలకు మరమ్మతులు చేశారు.

సింధుస్నానం ప్రత్యేకత..

సింధు అంటే సముద్రం అని అర్థం. మాఘ శుద్ధ పౌర్ణమి రోజున సముద్రంలో నది కలిసే ప్రాంతంలో స్నానమాచరించడాన్నే సింధు స్నానం అంటారు. సూర్యుడు మకరరాశిలో ఉండగా పౌర్ణమి రోజున ప్రసరించే కిరణాలు సముద్రపునీటిపై పడి శక్తివంతమవుతాయిని, ఈ ప్రభావంతో సముద్రంలో ఉండే రత్నాలు, దివ్య ఔషధాలు సంకలనం చెందుతాయని, ఆ సమయంలో సముద్రస్నానం చేయడం వల్ల సర్వరోగాలు తొలుగుతాయని పండితులు చెబుతున్నారు.

అభివృద్ధిపై టీడీపీ నేతలవి అబద్ధాలు

వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జి పేర్ని కిట్టు



11వ డివిజన్‌లో డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గం అభివృద్ధిపై ప్రతిపక్ష టీడీపీ నాయకులు ప్రజలకు అబద్ధాలు చెబుతుండటం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 6వ డివిజన్‌లో రూ. 35 లక్షలు, 11వ డివిజన్‌లో రూ. 22 లక్షలు, 8వ డివిజన్‌లో రూ. 42.50 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లు, పక్కా డ్రెయిన్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు హడావుడిగా శంకుస్థాపనలు చేస్తున్నారే కానీ అవి ముందుకు సాగవని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి ఇచ్చిన రూ. 20 కోట్ల ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. దీన్ని ఓర్వలేని రవీంద్ర ఈ పనులు జరగవని అవాస్తవాలు ప్రజలకు చెబుతున్నారన్నారు. తాము పనులు చేపట్టే ప్రాంతాల్లో మంచాలు ఏర్పాటు చేస్తామని టీడీపీ నాయకులు ప్రశాంతంగా అక్కడ ఉండి పనులు జరుగుతున్నదీ, లేనిదీ చూడాలన్నారు. టీడీపీ పాలనలో పేదలకు కనీసం పట్టా కూడా ఇవ్వని నాయకులు కాలనీల్లో పర్యటిస్తూ తాము ఏ అభివృద్ధి చేయలేదన్నట్లు ఆరోపణలు చేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. మచిలీపట్నంలోని అన్ని ప్రాంతాల్లో నివేశనా స్థలాలు ఇచ్చి కాలనీలు ఏర్పాటు చేసిన ఘనత పేర్ని కృష్ణమూర్తి, పేర్ని వెంకట్రామయ్య (నాని)లకే దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, 6, 8 డివిజన్ల కార్పొరేటర్లు పర్ణం సతీష్, శ్రీరాం చిన్నా, 11వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గూడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధనకు సహకార సంఘాలు

ఫిషరీస్ కళాశాల విద్యార్థులకు అవగాహన

నాగాయలంక: మత్స్య వృత్తులవారు ఆర్థిక స్వావలంబన సాధనకు మత్స్యమిత్ర స్వయం సహాయక సంఘాలు దోహదపడతాయని అవనిగడ్డ ప్రాంతీయ మత్స్య అభివృద్ధి అధికారి తూములూరి సునీత చెప్పారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం సహకార సంఘాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వివిధ వృత్తుల సహకార సంఘాలను బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని వివరించారు. దీనిలో భాగంగా సంబంధిత సహకార సంఘాలు, సభ్యుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అల్లిఅశ్రిత, జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ లంకె అమ్మాజీ, ఎల్.నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, వీఎఫ్ఎలు ఎం.జగదీప్, మురళి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



కోసూరువారిపాలెంలో మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండల గ్రామ సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు నాయనమ్మ నాగమల్లేశ్వరమ్మ(86) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సమాచారం అందుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కోసూరువారిపాలెంలో వారి ఇంటికి శుక్రవారం వెళ్లి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ కోసూరు అనూష, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, యూత్ కన్వీనర్ బచ్చు దిలీప్, గ్రామ పార్టీ కన్వీనర్ గరికిపాటి రేణుకయ్య, యక్కటి గిరిధర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీ నాంచారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్ష్మీపురం(చల్లపల్లి): గ్రామంలోని ప్రాచీన దేవాలయం శ్రీ బాలా త్రిపుర సుందరి సహిత లక్ష్మీ నాంచారమ్మ తల్లి అమ్మవారి దేవాలయ 92వ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ శివ ఆలయంలో సహస్ర దీపారాధన, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆలయ కమిటీ పెద్దలు దాలిపర్తి నారాయణరావు, మోదుమూడి కుటుంబరావు ఆధ్వర్యాన మురళీ కోలాటం, అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

137 మద్యం సీసాల స్వాధీనం

గూడూరు: మండలంలోని మల్లవోలులో బెల్ట్ షాపు నిర్వాహకులకు మద్యం సరఫరా చేస్తున్న మద్యం దుకాణం సేల్స్‌మేన్‌పై ఎస్‌ఈబీ అధికారులు కేసు నమోదు చేశారు. మండలంలోని మల్లవోలులో బెల్ట్ షాపు నిర్వాహకులకు మద్యం దుకాణం నుంచి అధిక ధరకు సేల్స్‌మెన్ మద్యం సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని వచ్చిన పక్కా సమాచారంతో సోమవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 137 మద్యం సీసాలతో పాటుగా ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మచిలీపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ తెలిపారు.

దాడుల్లో ఎస్సై జి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలు, నాటు సారా తయారీ, అమ్మకాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై తమకు సెల్ నంబరు 99632 17059కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సత్యనారాయణ ప్రజలను కోరారు.

కేంద్రం తీరుపై రైతుల నిరసన

బంటుమిల్లి: హరియాణాలో జరుగుతున్న రైతు ఆందోళనకు మద్దతుగా స్థానిక లక్ష్మీపురం సెంటర్లో శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు నెరవేర్చాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

రేపు భావనారుషి కల్యాణం

లక్ష్మీపురం(చల్లపల్లి): లక్ష్మీపురం పరిధిలోని పద్మశాలిపేటలో కొలువై ఉన్న శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామివారి దేవాలయ కల్యాణ మహోత్సవం ఈ నెల 25న నిర్వహించనున్నారు. 16వ వార్షిక కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని 24న ఆలయంలో ప్రత్యేక పూజలు, రాత్రి స్వామి వారి ఊరేగింపు, 25న శ్రీ భక్త మార్కండేయ మహా ముని కుమారుడు శ్రీ భావనారుషి స్వామి వారికి, శ్రీ ఛాయా సూర్య భగవానుని పుత్రికారత్నమైన శ్రీ భద్రావతి అమ్మవారికి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలి



మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలని అవధూత దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ అన్నారు. స్వామీజీ శుక్రవారం మచిలీపట్నంలోని దత్తాశ్రమానికి విచ్చేశారు. మాఘ మాస పర్యటనలో భాగంగా జరిగే పలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శుక్రవారం దత్తాశ్రమంలో శ్రీ చక్రార్చన, సౌందర్య లహరి పారాయణ, మహాగణపతి హోమం, సంగీతసేవ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. శనివారం మాఘ పౌర్ణమి పురస్కరించుకుని దత్తాశ్రమంలో జరిగే శ్రీ శనీశ్వరస్వామికి, దత్తాత్రేయస్వామికి తైలాభిషేకం, శ్రీచక్రార్చన, శ్రీ లక్ష్మీనారాయణ హోమం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నారు. స్వామీజీని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం దర్శించుకుని ఆశీర్వచనాలు పొందారు.

బంటుమిల్లి: భక్తులు సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని దత్తవిజయానందతీర్థ స్వామీజీ అన్నారు. ఆయన పర్యటనలో భాగంగా శుక్రవారం స్థానిక శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివార్కి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సబ్బిశెట్టి రాజ, సభ్యులు కె. శ్రీనివాసరావు, వూర బాబు, యూపీఆర్ విఠల్ పాల్గొన్నారు.

26 నుంచి గంగానమ్మ జాతర

పామర్రు: స్థానిక గంగానమ్మ తల్లి ఆలయ జాతర మహోత్సవాలను ఈనెల 26 నుంచి మార్చి 3వ తేదీ వరకూ నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులు తలపెట్టారు. జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు శుక్రవారం మాట్లాడుతూ ఏడు రోజుల పాటు గ్రామంలో జరిగే ఈ మహోత్సవానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి వేలాది భక్తులు వస్తారని తెలిపారు. అమ్మవారి ఘటం కుండను, పోతురాజు గడలకు గ్రామోత్సవంలో మేళ తాళాలతో కనక తప్పెట్లతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. తొలుత ఈ నెల 26న తెల్లవారుజామున గంగానమ్మతల్లిని మేళ తాళాలతో, కనక తప్పెట్లతో ఊరేగింపుగా ఆమె పుట్టినిల్లు అయిన బొమ్మారెడ్డి మధుసూదనరెడ్డి(మునసబుగారి) ఇంటి వద్దకు తీసుకెళ్లి అక్కడ అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించి అనంతరం అక్కడి నుంచి పసుపు,కుంకుమ, నూతన వస్త్రాలను తీసుకొస్తారని పేర్కొన్నారు. ఆలయంలో గంగానమ్మకు జాతర తొలిరోజున 108 మంత్ర జలాలతో అభిషేకం నిర్వహించి పుట్టింటి నుంచి తెచ్చిన వస్త్రాలను సమర్పించి, పసుపు కుంకుమలతో అమ్మవారిని అలంకరిస్తారని తెలిపారు. అదే రోజు ఆలయం వద్ద నుంచి గ్రామోత్సవానికి గంగానమ్మ బయలు దేరుతుందని పేర్కొన్నారు. తొలిరోజే గ్రామంలోని నాలుగు పొలిమేరల్లో కట్టుని నిర్వహించి దుష్ట శక్తులు గ్రామంలోకి ప్రవేశించకుండా కట్టడి చేస్తారన్నారు.

జగన్ పాలనలో గ్రామ స్వరాజ్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



ఆముదార్లంకలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

ఆముదార్లంక(చల్లపల్లి): మహాత్మాగాంధీ ఆకాంక్షించిన గ్రామ స్వరాజ్యం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారమైందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆముదార్లంకలో శుక్రవారం రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.9.03 లక్షలతో నూతనంగా నిర్మించిన రెండు సీసీ రోడ్లను ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ గిడ్డంగులు, నూతన పీఏసీఎస్ భవనాలు, నాడు-నేడు ద్వారా నూతన శోభ సంతరించుకున్న ప్రభుత్వ పాఠశాలలు గ్రామీణ అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.నాగలక్ష్మి, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, పంచాయతీరాజ్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నానీ), జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, సర్పంచ్ నడకుదుటి ఆదిలక్ష్మి, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, వీఆర్వో అవనిగడ్డ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవమూర్తుల తెప్పోత్సవం

హంసలదీవిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



జలవిహారం చేస్తున్న వేణుగోపాలుడు, కాశీవిశ్వేశ్వరుడు

కోడూరు: శివకేశవలు ఇద్దరు ఒకే తెప్పపై జలవిహారం చేసి భక్తులకు కనులవిందు చేశారు. హంసలదీవిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం సాయంత్రం వేణుగోపాలుడు, కాశీవిశ్వేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులను గ్రామంలోని చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి, టీటీడీ వేదపాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని శిష్య బృందంతో కలిసి తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం రాజ్యలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చనను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కుప్పా వంశీయులు పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. స్వామివార్ల ఉత్సవమూర్తులకు తిరుమంజనసేవను భక్తిప్రపత్తులతో చేశారు.

కమనీయం.. శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



శ్రీగోపయ్యస్వామి సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణోత్సవంలో ఓ ఘట్టం

రేమాలవారిపాలెం(నాగాయలంక): లోక కల్యాణార్థం మాఘ శుద్ధ చతుర్దశి పురస్కరించుకుని స్థానిక శ్రీగోపయ్యస్వామి సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు, స్వామివార్ల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. పండితుడు లంక వెంకటచలపతిరావు బ్రహ్మత్వంలో గర్భగుడిలో తొలుత అమ్మవారికి విశేష పూజలు జరిపి, వక్కపట్ల వెంకట నరసింహారావు-లక్ష్మీపావని, అవుల నాగరాజు-అనురాధ, వాడపల్లి కొండలరావు-లక్ష్మి పీటలపై కూర్చోగా కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అవుల బేబీ సరోజినీ నేతృత్వంలో 600మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. స్థానిక ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు, బోనం పాపారావు, లేబాక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత ఓట్లు.. ప్రగతికి మెట్లు ..



ర్యాలీలో తహసీల్దార్ రాంబాబు, కమిషనర్ ఏసుబాబు తదితరులు

పెడన: ఓటున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పెడన తహసీల్దార్ కె.రాంబాబు అన్నారు. శుక్రవారం పెడన పురపాలక సంఘ కార్యాలయం నుంచి బంటుమిల్లి రోడ్డు సెంటరు వరకు.. ఓటరు మహాశయా మేల్కో.. యువతరం ఓట్లు ప్రగతికి మెట్లు అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ర్యాలీ నిర్వహించాలని పేర్కొవడమే కాకుండా ఓటరును చైతన్యం చేయాలని సూచించామన్నారు. ఓటు హక్కు రాని అర్హులు ఎవరైనా ఉంటే ఆన్‌లైన్‌లో లేదా తమ సమీపంలోని పోలింగ్ బూత్‌లోను, లేదా తహసీల్దారు కార్యాలయంలోని ఎన్నికల విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వి.ఏసుబాబు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దారు కల్పన, ఆర్ఐ మణికుమార్, మెప్మా టీఎంసీ భోగేశ్వరరావు, సీఆర్పీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

చురుగ్గా మహాశివరాత్రి ఏర్పాట్లు

కృత్తివెన్ను: ప్రసిద్ధి గాంచిన శ్రీ దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఈ నెల 8వ తేదీ నుంచి జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆలయం ముందు భాగంలోని ఖాళీ స్థలాన్ని చదును చేసే పనులను చేపట్టామన్నారు. ఈ ప్రాంగణంలో దుకాణ సముదాయాలతో పాటు, వివిధ రకాల వినోదాన్నందించే పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. ఐదురోజుల పాటు వైభవంగా ఉత్సవాలు జరుగుతాయని కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలతో పాటు, రెండు తెలుగురాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారని ఆయన వివరించారు. పనులను ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఆలపాటి నాగేశ్వరరావు పరిశీలించారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

గుడివాడ టౌన్: క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య అన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో రెండు రోజులు జరిగే వీకేఆర్ స్పోర్ట్స్‌మీట్‌ను ఆయన ప్రారంభించారు. యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇంజినీరింగ్, ఎంబీఏ, డిప్లొమా కళాశాలల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొంటారన్నారు. విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్, త్రోబాల్, షార్ట్‌పుట్, క్రికెట్, టెన్నికాయిట్ పోటీలు జరుపుతున్నామన్నారు. సుమారు 300 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. అనంతరం బాడీ బిల్డింగ్ 70 కిలోల విభాగంలో ఉమ్మడి కృష్ణాజిల్లా తరుపున బంగారు పతకం సాధించిన దిలీప్‌కు రూ.10 వేలు బహుమతితో సత్కరించారు. కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అండ్ ఎస్‌బీ ఎల్ఐసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్‌శాఖ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని నిర్వాహకులు పేర్కొన్నారు.